
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం । 28 । ఫిబ్రవరి । 2024



ముందుంది ముప్పు

పాలేరు జలాశయంలో నీరు అడుగంటుతుండడంతో వేసవిలో తాగునీటికి ఇబ్బందులు తప్పవనే ఆందోళన వ్యక్తమవుతోంది. 8లో



..ఆదివాసీలకు అన్యాయం

మహబూబాబాద్ పార్లమెంట్ టికెట్ కేటాయింపులో ఆదివాసీలకు అన్యాయం జరుగుతోందని కాంగ్రెస్ నేత చందా లింగయ్య అన్నారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
35° / 22°

జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు గంట గంటకూ పెరుగుతాయి. రాత్రి వేళ మాత్రం వాతావరణం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని ఆంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

రేపు ఆలయ హుండీ లెక్కింపు

భద్రాచలం: భద్రాద్రి రామాలయం ఆలయ హుండీలను గురువారం లెక్కించనున్నట్లు ఈఓ రమాదేవి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు చిత్రకూట మండపంలో లెక్కింపు మొదలవుతుందని పేర్కొన్నారు. అధికారులు, సిబ్బంది సకాలంలో హాజరు కావాలని ఈఓ సూచించారు.

ఎంపీపీపై నెగ్గిన అవిశ్వాసం




సమావేశానికి హాజరైన ఎంపీటీసీలు

సుజాతనగర్: సుజాతనగర్ ఎంపీపీ భూక్యా విజయలక్ష్మిపై ఎంపీటీసీలు పెట్టిన అవిశ్వాస తీర్మానం మంగళవారం నెగ్గింది. బీఆర్‌ఎస్‌కు చెందిన విజయలక్ష్మిపై ఇటీవల ఐదుగురు ఎంపీటీసీలు కొత్తగూడెం ఆర్డీఓకు అవిశ్వాస తీర్మాన నోటీసు అందజేశారు. దీంతో డీఆర్‌ఓ ఎం.రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్‌కు చెందిన ఎంపీటీసీలు కళ్లబోయిన భద్రం, బానోత్ అనిత, సీపీఐ ఎంపీటీసీలు భూక్యా పద్మావతి, విజయ కుమార్, బీఆర్‌ఎస్ ఎంపీటీసీలు బత్తుల మానస, మూడు గణేష్ సమావేశానికి హాజరయ్యారు. అధికారులు ఓటింగ్ నిర్వహించగా, హాజరైన ఆరుగురు అవిశ్వాసానికి మద్దతు తెలిపారు. దీంతో ఎంపీపీపై అవిశ్వాసం నెగ్గినట్టు డీఆర్‌ఓ ప్రకటించారు. అవిశ్వాస తీర్మానాన్ని కలెక్టర్ ద్వారా పంచాయతీరాజ్ కమిషనర్‌కు పంపిస్తామని, తదుపరి ఉత్తర్వులు వచ్చాక ఎంపీపీ ఎన్నిక నిర్వహిస్తామని రవీంద్రనాథ్ వెల్లడించారు. సమావేశంలో ఎంపీడీఓ టి.వెంకటలక్ష్మి, ఎంపీఓ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు ఊరట

- ఇక నుంచి ప్యాసింజర్ రైలుగా 'సింగరేణి'
- గతంతో పోలిస్తే తగ్గిన చార్జీలు



కొత్తగూడెంఅర్బన్: కరోనా సమయాన రద్దు చేసిన కొన్ని రైళ్లను రైల్వే శాఖ ఆ తర్వాత పునరుద్ధరిస్తోంది. అయితే, ఆయా రైళ్లను ఎక్స్‌ప్రెస్‌గా మార్చి ఎక్కువ చార్జీలు వసూలు చేశారు. రైళ్ల వేగం, సౌకర్యాలు అలాగే ఉన్నా చార్జీలు పెంచడంపై ప్రయాణికుల నుంచి అసంతృప్తి వ్యక్తమైనా, తప్పని పరిస్థితుల్లో ప్రయాణించారు. ఇంతలోనే మంగళవారం నుంచి కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లను మళ్లీ ప్యాసింజర్లుగా మారుస్తూ రైల్వే శాఖ నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా కొత్తగూడెం నుంచి సిర్పూర్‌కాగజ్‌నగర్ వరకు తెల్లవారుజామున 5 గంటలకు మొదలయ్యే సింగరేణి రైలును ప్యాసింజర్‌గా మార్చడంతో చార్జీలు తగ్గాయి. ఈమేరకు ప్రయాణికులకు ఊరట కలిగినట్లయింది.

కాకతీయ స్పీడ్ తక్కువ.. చార్జీ ఎక్కువ

కొత్తగూడెం నుంచి మొదలయ్యే కాకతీయ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రతీ స్టేషన్‌లో ఆగుతూ నెమ్మదిగా గమ్యస్థానానికి చేరుతుంది. అయినప్పటికీ ఎక్స్‌ప్రెస్‌గా పేరు పెట్టి ఎక్కువ చార్జీ వసూలు చేస్తున్నారు. సింగరేణి రైలు మాదిరిగానే ఈ రైలునూ ప్యాసింజర్‌గా మార్చి చార్జీలు తగ్గించాలని ప్రయాణికులు కోరుతున్నారు. అలాగే, బెళగావి రైలును కూడా స్పెషల్ పేరుతో ఎక్కువ చార్జీ వసూలు చేస్తున్నందున అధికారులు స్పందించాలనే డిమాండ్ వస్తోంది.

పూడిక.. తీయక..

జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల్లో కీలకమైన తాలిపేరులో పూడిక పేరుకుపోయింది. దశాబ్దాలుగా నామ్ కే వాస్తేగా నిర్వహణ చేపడుతుండడంతో ఈ పరిస్థితి తలెత్తింది. 70వ దశకంలోనే అప్పటి అవసరాలతో పాటు దూరదృష్టితో చూసిన ప్రభుత్వం.. తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టు నిర్మాణం చేపట్టింది. చర్ల మండల పరిధిలో 1976లో ప్రాజెక్టు పనులు ప్రారంభించారు. నిధుల కొరత, స్థానికంగా నెలకొన్న అననుకూలత కారణంగా కింద, పైనా పడుతూ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయి నీళ్లు నింపేందుకు పదేళ్లు పట్టింది. 1986 నుంచి ఈ ప్రాజెక్టుకు సంబంధించిన కుడి, ఎడమ కాల్వల ద్వారా చర్ల, దుమ్ముగూడెం మండలాల పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో 24 వేల ఎకరాలకు నీరు అందిస్తున్నారు. అయితే ఈ ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం కేవలం అర టీఎంసీనే కావడంతో రబీ సీజన్ వచ్చే సరికి కేవలం ఎనిమిది వేల ఎకరాల ఆయకట్టుకే నీరు ఇవ్వగలుగుతున్నారు. దీని కోసం ఆయకట్టును మూడు జోన్లుగా విభజించి వంతుల వారీగా సాగునీరు అందిస్తున్నారు.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం



తాలిపేరు ప్రాజెక్టులో భారీగా పేరుకు పోయిన పూడిక

తాలిపేరులో భారీగా పేరుకుపోయిన సిల్ట్

- మూడు దశాబ్దాలుగా పట్టించుకోని అధికారులు
- తగ్గిపోతున్న ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం
- సీతమ్మసాగర్‌తో ముడిపడిన పూడిక పనులు

గేట్ల మరమ్మతులతోనే సరి..

నీటి నిల్వ సామర్థ్యం తక్కువగా ఉన్నందున గరిష్ట స్థాయిలో ప్రయోజనం పొందాలంటే ప్రాజెక్టులో చేరిన పూడికను ఎప్పటికప్పుడు తొలగించాల్సి ఉండగా, ఇప్పటివరకు ఆ దిశగా ప్రయత్నమే జరుగలేదు. గేట్ల మరమ్మతుల వంటి ప్రాథమిక పనులు, సీసీ కెమెరాల ఏర్పాటు వంటి వాటికే పరిమితమయ్యారు తప్ప పేరుకుపోయిన సిల్ట్‌ను పట్టించుకోలేదు. గత ప్రభుత్వం మిషన్ కాకతీయ కింద చెరువుల్లో పూడికకే ప్రాధాన్యత ఇచ్చింది. దీంతో తాలిపేరులో పూడికతీత సాధ్యం కాలేదు. ఫలితంగా తాలిపేరు ప్రాజెక్టు అంతటా భారీ ఎత్తున సిల్ట్ పేరుకుపోయింది. ఇలా నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోవడంతో కాల్వల చివరి ఆయకట్టుకు ఆశించినంతగా నీరు అందడం లేదు.

రెండేళ్లుగా నిలిచిన పనులు..

తెలంగాణ ఆవిర్భావం తర్వాత బహుళార్థ సాధక ప్రాజెక్టుగా దుమ్ముగూడెం – అశ్వాపురం మండలాల మధ్య గోదావరి నదిపై సీతమ్మసాగర్ బ్యారేజీ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇక్కడ 36 టీఎంసీల సామర్థ్యంతో బ్యారేజీ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. దీంతో బ్యారేజీ ఎగువన ఇటు అశ్వాపురం, మణుగూరు, అటు దుమ్ముగూడెం, చర్ల మండలాల పరిధిలో గోదావరి నదికి ఇరువైపులా సుమారు 30 కి.మీ. పొడవుతో కరకట్టలు నిర్మించాలని నిర్ణయించారు. ఈ కరకట్టలకు భారీగా మట్టి అవసరం ఏర్పడింది. దీంతో సీతారామా ప్రాజెక్టుకు మంజూరైన నిధులతో తాలిపేరు ప్రాజెక్టులో పూడికను తీసి, ఆ మట్టిని కరకట్ట నిర్మాణానికి ఉపయోగించాలని నిర్ణయించారు. పూడికతీత పనులు గతేడాది రబీ సీజన్‌లో మొదలు కావాల్సి ఉంది. అయితే తాలిపేరు పరిధిలోని రబీ సీజన్ ఆయకట్టు రైతులు ఇందుకు అభ్యంతరం తెలిపారు. దీంతో పనులు వాయిదా పడ్డాయి. ఆ వెంటనే పర్యావరణ అనుమతులు లేవనే కారణంతో సీతమ్మ సాగర్ నిర్మాణ పనులపై గ్రీన్ ట్రిబ్యునల్ ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో 2023 మే చివరి వారం నుంచి సీతమ్మసాగర్ పనులు కూడా ఆగిపోయాయి. ఇదే వరుసలో కరకట్ట నిర్మాణ పనులు, దానిపై ఆధారపడ్డ తాలిపేరు పూడిక పనులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. ప్రస్తుత ప్రభుత్వమైనా సీతమ్మసాగర్‌తో ముడిపెట్టకుండా తాలిపేరు ప్రాజెక్టు పూడికతీత పనులపై దృష్టి సారించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

ఖరీఫ్‌లోనూ నీరందడం లేదు



తాలిపేరు ఎడమ కాలువ ద్వారా మండలంలోని చివరి భూములకు నీరందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నర్సాపురం వరకు కూడా సక్రమంగా నీరు రావడం లేదు. గత ఖరీఫ్‌లో తాలిపేరు కాల్వ కింద భూములు ఎండిపోయే పరిస్థితులు వచ్చాయి. కాల్వకు భారీగా గండ్లు పడటం, నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ ఏడాదైనా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలి.

– రావులపల్లి పృథ్వీ, నర్సాపురం

నిర్వహణ సక్రమంగా లేకనే..



తూరుబాక, నర్సాపురం, రామకృష్ణాపురం, బండారుగూడెం గ్రామాల చివరి భూములకు ఎల్‌డీ– 4 కాల్వ ఆర్‌సీ చానల్ ద్వారా నీటి సరఫరా జరగాలి. కానీ ఆర్‌సీ చానల్‌కు మరమ్మతులు లేక చానల్ దగ్గరే నీరు వృథాగా పోతోంది. గత పదేళ్లుగా చానల్ నిర్వహణ సక్రమంగా చేపట్టడం లేదు. సాగునీరందక రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో 2 నుంచి 3 వేల ఎకరాలకు నీరందక పంటలు ఎండిపోతున్నాయి.

– బొల్లి సూర్యచంద్రరావు, తూరుబాక

సేవాలాల్ బోధనలు పాటించాలి



సేవాలాల్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రియాంక అల



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య. పక్కన ఎస్పీ రోహిత్‌రాజ్, కలెక్టర్ ప్రియాంక అల

- ఆయన మార్గం అనుసరణీయం
- కలెక్టర్ ప్రియాంక అల వెల్లడి
- ఇల్లెందులో ఘనంగా సేవాలాల్ జయంతి వేడుకలు
- హాజరైన ఎస్పీ రోహిత్‌రాజ్, ఎమ్మెల్యే కోరం

ఇల్లెందు: సంత్ సేవాలాల్ మహరాజ్ బోధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని కలెక్టర్ ప్రియాంక అల అన్నారు. ఆయన చూపిన మార్గం మానవాళి పురోభివృద్ధికి దోహదం చేస్తుందని ఘనంగా నివాళులర్పించారు. సేవాలాల్ మహరాజ్ 285వ జయంతి వేడుకలను పట్టణంలోని జేకే సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో మంగళవారం అధికారికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్‌కు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అతిథులకు బంజారా సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికాక.. జ్యోతి ప్రజ్వలన చేసి భోగ్ బండారో, వింతీ కార్యక్రమాలు ప్రారంభించారు. అంతకుముందు కోటిలింగాల క్రాస్ రోడ్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, గోవింద్ సెంటర్ నుంచి సింగరేణి హైస్కూల్ వరకు సద్భావన ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ.. తండాల్లో అశాంతి లేని జీవనం సాగించాలని నిరంతరం పాటుపడిన సేవాలాల్ నేటి తరానికి ఆచరణీయుడని అన్నారు. తన జీవితాన్ని బంజారా జాతి అభివృద్ధి కోసం త్యాగం చేసిన మహనీయుడని కొనియాడారు. సేవాలాల్ జయంతిని ప్రభుత్వ కార్యక్రమంగా నిర్వహించడం, అందులో తాను పాల్గొనడం ఆనందంగా ఉందని అన్నారు. ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ.. సంచార జాతులుగా అడవుల్లో జీవనం సాగిస్తున్న లంబాడాలను చేరదీసి, వారిలో చైతన్యం కల్పించిన సేవాలాల్ మహరాజ్‌ను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఆయన ఆదర్శ పురుషుడని కొనియాడారు. గిరిజనుల జీవన విధానం మెరుగుపర్చేందుకు దేశ వ్యాప్త పర్యటన చేశారని తెలిపారు. సత్యనిష్ఠతో మెలిగి ప్రజలకు ఆరాధ్య దైవంగా మారాడని వివరించారు. ఎస్పీ రోహిత్‌రాజ్ మాట్లాడుతూ సంత్ సేవాలాల్ బోధనలను ప్రతీ ఒక్కరు పాటించాలని, ఆయన సూచించిన మార్గంలో సగం మేర పాటించినా మానవులు మాధవులుగా మారుతారని అన్నారు. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్, కాంగ్రెస్ నాయకులు తేజావత్ బెల్లయ్య నాయక్, ప్రేమ్ చంద్ నాయక్, నామా నాయక్, భూక్యా ప్రవీణ్ నాయక్, బానోతు రాంబాబు, కున్సోత్ రాము, నాగార్జున్, భూక్యా శంకర్, బానోతు శారద, ఎంపీటీసీ రోజా, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

అధిష్టానం ఆదేశాల మేరకు నడుచుకుంటా..

డిప్యూటీ సీఎం సతీమణి నందిని



భద్రాచల దేవస్థానంలో మల్లు నందిని, తదితరులు

భద్రాచలం: కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు నడుచుకుంటానని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సతీమణి నందిని తెలిపారు. భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానానికి మంగళవారం వచ్చిన ఆమె ప్రత్యేక పూజలు చేశారు. ఆతర్వాత నందిని విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ తరఫున ఖమ్మం ఎంపీగా పోటీ చేసేందుకు దరఖాస్తు చేశానని తెలిపారు. అయితే, పార్టీ ఆదేశాలను శిరసావహిస్తానని, పెద్దలు ఆదేశిస్తే పోటీలో ఉంటానని పేర్కొన్నారు. భద్రాచలం రామాలయం అభివృద్ధిని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టించుకోకపోగా.. కాంగ్రెస్ హయాంలో అభివృద్ధి జరిగి తీరుతుందని చెప్పారు. తొలుత ఆమెకు ఆలయ అర్చకులు, ఈఓ రమాదేవి స్వాగతం పలికి స్వామి దర్శనం అనంతరం వేదాశీర్వచనం, ప్రసాదాలు అందచేశారు.

బాలోత్సవ్‌తో కళారంగ అభివృద్ధి

డీఈఓ వెంకటేశ్వరాచారి



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కొత్తగూడెంరూరల్: విద్యార్థులు చదువుతోపాటు కళా రంగంలో నైపుణ్యం పెంపొందించుకునేందుకు బాలోత్సవ్ ఒక వేదిక అన్ని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరాచారి అన్నారు. సింగరేణి సీఈఆర్ క్లబ్‌లో నిర్వహిస్తున్న బాలోత్సవ్‌ను రెండో రోజైన మంగళవారం బీఆర్‌ఎస్ నాయకుడు కోనేరు సత్యనారాయణ రావు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు కళా రంగంలోనూ రాణించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు బాలోత్సవ్‌లో పాల్గొని ప్రతిభ చాటాలని పిలుపునిచ్చారు. ఆట పాటలతో కూడిన బాలల పండుగలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర నలుమూల నుంచి వచ్చిన విద్యార్థులు తమలోని కళా నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకుంటున్నారని చెప్పారు. రెండో రోజు బాలోత్సవ్‌లో జానపద నృత్యాలు, చిన్నారుల సమ్మక్క– సారలమ్మ, అల్లూరి సీతారామ వేషధారణలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బాలోత్సవ్ కన్వీనర్ మద్దెల శివకుమార్, సింగరేణి రిటైర్డ్ జీఎం ఆనందరావు, అంతోటి పాల్, రావి రాంబాబు, లావుడ్యా సత్యనారాయణ పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

కలెక్టర్ ప్రియాంక అల



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక అల

సూపర్‌బజార్(కొత్తగూడెం): పదో తరగతి పరీక్షల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు జరిగే ఈ పరీక్షలను ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా నిర్వహించాలని అన్నారు. జిల్లాలో మొత్తం 12,341 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని, వీరిలో బాలురు 5,900 మంది, బాలికలు 6,441 మంది బాలికలు ఉన్నారని వివరించారు. 73 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రశ్న పత్రాలను భద్రపర్చడానికి 23 పోలీస్‌స్టేషన్లను ఎంపిక చేసినట్లు చెప్పారు. 73 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 73 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 720 మంది ఇన్విజిలేటర్లు, 5 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. పరీక్షల నిర్వహణలో అందరూ అప్రమత్తంగా ఉండాలని, పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యార్థినులను తనిఖీ చేసేందుకు మహిళా కానిస్టేబుళ్లు లేదా మహిళా ఉపాధ్యాయురాళ్లను మాత్రమే నియమించాలని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని, సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేయించాలని అన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులు, ఇన్విజిలేటర్లకు ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదన్నారు. దివ్యాంగులకు ప్రత్యేక గదులు కేటాయించాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ రవీంద్రనాథ్, డీఈఓ వెంకటేశ్వరాచారి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు శుభాకాంక్షలు

పరీక్షలు బాగా రాసి ఉజ్వల భవిష్యత్ ఏర్పర్చుకోవాలని కలెక్టర్ ప్రియాంక అల ఇంటర్ విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బుధవారం నుంచి జరిగే పరీక్షల కోసం అన్ని ఏర్పాట్లు చేశామని, ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు, భయాన్ని పోగొట్టేందుకు ప్రత్యేకంగా 14416 టెలీ మానస్ టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టెలీ మానస్‌కు కాల్ చేస్తే నిపుణులైన మానసిక వైద్యులు ఉచిత కౌన్సిలింగ్ ఇస్తారని తెలిపారు. అదేవిధంగా రాష్ట్రస్థాయిలో ఏర్పాటు చేసిన 040–24601010, 040–24655027 నంబర్లకు, జిల్లాస్థాయిలో ఏర్పాటు చేసిన 7997994366, 8919961013, 9441817478 కంట్రోల్ రూం నంబర్లకు ఫోన్ చేసి సమస్యలను, సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని వివరించారు. ఉదయం 9 గంటలకు పరీక్షలు ప్రారంభమవుతాయని, నిమిషం నిబంధన అమల్లో ఉన్నందున విద్యార్థులు ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా https: tsbiecgg. gov. in వెబ్‌సైట్ ఏర్పాటు చేసిందని, ఈ హాల్‌టికెట్లపై ఎలాంటి సంతకాలు అవసరం లేదని కలెక్టర్ ప్రకటించారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

పోలీసులకు ఎస్పీ సూచన

గుండాల: ఏజెన్సీ గ్రామాల్లోని ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు పోలీసులు అందుబాటులో ఉండాలని ఎస్పీ రోహిత్ రాజ్ అన్నారు. ఇల్లెందు సబ్ డివిజన్‌లోని గుండాల, ఆళ్లపల్లి, కొమరారం పోలీస్ స్టేషన్లను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. సైబర్ నేరాలపై అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని, ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు. మావోయిస్టుల కదలికలపై కూడా ఎప్పటికప్పుడు సమాచారం సేకరించి తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం ఆయా పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

డీఏఓ బాబూరావు




వరి పొలాన్ని పరిశీలిస్తున్న బాబూరావు, రైతులు

అన్నపురెడ్డిపల్లి : ఎరువులు, పురుగుమందులను అధిక ధరలకు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి వి.బాబూరావు హెచ్చరించారు. మంగళవారం ఆయన అన్నపురెడ్డిపల్లిలో ఎరువులు, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేశారు. అనంతరం అన్నపురెడ్డిపల్లి, నామవరం, పెద్దిరెడ్డిగూడెం గ్రామాల్లో పంటలను పరిశీలించారు. వరిలో కాండం తొలుచు, అగ్గి తెగుళ్లను గుర్తించి, నివారణకు చేపట్టాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటించి అధిక దిగుబడి సాధించాలన్నారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పంటల నమోదు వేగవంతం చేయండి

అశ్వారావుపేటరూరల్: పంటల నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావు అన్నారు. మంగళవారం ఆయన అశ్వారావుపేట, నారాయణపురంలో పర్యటించారు. నారాయణపురం సొసైటీ కార్యాలయంలో యూరియా, డీఏపీ నిల్వల రికార్డులను తనిఖీ చేశారు. స్థానిక ఎరువుల దుకాణాలను కూడా తనిఖీ చేశారు. అనంతరం ఏఈఓలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. పంటల నమోదులో నిర్లక్ష్యం చేయొద్దని, ప్రతి పంటనూ నమోదు చేయాలని ఆదేశించారు. ఆ తర్వాత పామాయిల్ తోటలో అంతర్ పంటగా సాగు చేస్తున్న వేరుశనగను పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏఓ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

టీఎన్‌జీఓస్ కార్యవర్గం ఎన్నిక



అమరనేని రామారావు



సాయి భార్గవ చైతన్య

సూపర్‌బజార్(కొత్తగూడెం): టీఎన్‌జీఓస్ జిల్లా కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అమరనేని రామారావు, కార్యదర్శిగా కంచర్ల సాయిభార్గవ చైతన్య ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా వ్యవహరించిన జి. వీరబాబు నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అసోసియేట్ అధ్యక్షుడిగా సీహెచ్. రామనర్సయ్య, కోశాధికారిగా జె. సోమయ్య, ఉపాధ్యక్షులుగా గద్దం ఉష, ఊటుకూరు నాగేశ్వరరావు, గొల్లమందల రమేష్, జాయింట్ సెక్రటరీలుగా నవీన్, మాటేటి ఉషారాణి, కార్యవర్గ సభ్యులుగా టి.అరుణ, మధుసూదన్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రామారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి, సంక్షేమ పథకాలను జిల్లాలోని పేదలకు చేరేలా కృషి చేస్తామని తెలిపారు. కార్యదర్శి సాయి భార్గవ మాట్లాడుతూ గతంలో జీఓ 317 ద్వారా చెల్లా చెదురైన కుటుంబాలను ఒకే దగ్గరకు తీసుకురావాలనే సంకల్పంతో నూతన ప్రభుత్వం ముగ్గురు సీనియర్ మంత్రులతో కమిటీ వేయడం హర్షణీయమన్నారు.

ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారు..



విజయసంకల్ప యాత్రలో మాట్లాడుతున్న ప్రేమేందర్‌రెడ్డి, పక్కన నాయకులు

పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి

ఇల్లెందు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులవుతున్న ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాకతీయ క్లస్టర్ ఇన్‌చార్జ్ గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి అన్నారు. ప్రధాని నరేంద్రమోడీని మూడోసారి అధికార పీఠం ఎక్కించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. స్థానిక జగదాంబ సెంటర్‌లో మంగళవారం రాత్రి జరిగిన విజయ సంకల్ప యాత్ర బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. దేశంలో సుస్థిర పాలన, సామాజిక న్యాయం అందించడమే బీజేపీ లక్ష్యమన్నారు. కుల, మత, వర్గ రహిత సమాజ నిర్మాణానికి తమ పార్టీ పాటుపడుతోందని చెప్పారు. నరేంద్రమోడీ నాయకత్వంలో అవినీతి రహిత పాలన అందుతోందన్నారు. పేదల కష్టాలు ఏంటో తెలిసిన మోడీ.. దేశంలో పేదరికాన్ని పారదోలేందుకు, వారికి ఆర్థిక, స్వాతంత్ర్య ఫలాలు అందించేందుకు అనేక పథకాలు ప్రవేశపెట్టారని వివరించారు. మాజీ ఎమ్మెల్యే ఎం.ధర్మారావు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్ల కాలంలో ముస్లిం మహిళలకు తీరని అన్యాయం జరిగిందని, తలాక్ వ్యవస్థను రూపుమాపిన చరిత్ర మోడీకి దక్కిందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో మూడోసారి మోడీని ప్రధానమంత్రిని చేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రంగా కిరణ్, నేతలు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, యాప సీతయ్య, గుగులోతు రాంచందర్ నాయక్, నాళ్ల సోమసేందర్, బలగాని గోపీకృష్ణ, మావునూరి మాధవ్, మహేశ్వర్, కొల్లి సంజీవరెడ్డి, సుచిత్ర, సునీత తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులను ఆకట్టుకునేలా బోధించాలి

- ఐటీడీఏ డీడీ మణెమ్మ



మాట్లాడుతున్న ఏటీడీఓ రూపాదేవి

ఇల్లెందురూరల్: విద్యార్థులను ఆకట్టుకునేలా ఉపాధ్యాయులు బోధన చేయాలని ఐటీడీఏ డీడీ మణెమ్మ, ఏటీడీఓ రూపాదేవి అన్నారు. మండలంలోని వైటీసీలో ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాన్ని మంగళవారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలని, ఇందుకోసం వారి అభిరుచికి తగ్గట్టుగా బోధించాలని సూచించారు. ఆట, పాటలతో కూడిన బోధనకు విద్యార్థులు ఆకర్షితులవుతారని చెప్పారు. ప్రతి విద్యార్థి పాఠ్యాంశాలను చదవడం, అక్షర దోషాలు లేకుండా రాయడం వంటి విషయాలపై ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలని కోరారు.

పదోన్నతి బాధ్యతలను పెంచుతుంది..

మణుగూరు టౌన్: పదోన్నతులు బాధ్యతలను మరింతగా పెంచుతాయని ఎస్‌ఓటూ జీఎం వీసం కృష్ణయ్య అన్నారు. మంగళవారం ఓసీ–2 బేస్ వర్క్‌షాప్‌లో అర్హత కలిగిన ఏ–గ్రేడ్ ఈపీ ఆపరేటర్లకు పదోన్నతుల ద్వారా ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తుపల్లి, కొత్తగూడెం, ఇల్లెందు ఏరియాల్లో పనిచేస్తూ మూడు సంవత్సరాలు పూర్తి చేసుకున్న 11 మంది ఏ–గ్రేడ్ ఆపరేటర్లకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. సీనియార్టీతో పాటు అంకితభావం, ప్రమాద రహిత రవాణా చేయడంతో పాటు సాంకేతిక పరిజ్ఞానంపై సరైన అవగాహన కలిగి ఉండటం, డ్రైవింగ్‌పై అవగాహన వంటి అంశాల ప్రామాణికంగా ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇల్లెందు ఏరియా డీజీఎం(పర్సనల్) వెంకట మోహన్‌రావు, పీఓ రవీందర్, దాసరి రాజశేఖర్, సీహెచ్ వెంకటేశ్వర్లు, సింగు శ్రీనివాస్, బుర్ర వెంకటేశ్వర్లు, గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలు లేరనే మనస్తాపంతో ఆత్మహత్య

మణుగూరు టౌన్: వివాహమై నాలుగేళ్లు దాటినా పిల్లలు పుట్టలేదనే మనస్తాపంతో వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మణుగూరులో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని పీకే – 1 సెంటర్‌కు చెందిన ధనుగూరి స్వాతి(23)కి ప్రవీణ్‌తో నాలుగేళ్ల క్రితం పెళ్లయింది. ఇంతవరకు సంతానం కలగకపోవడంతో మనస్తాపానికి గురైన స్వాతి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించామని పోలీసులు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

అశ్వారావుపేటరూరల్: పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని నందమూరినగర్‌కు చెందిన ఆరేపల్లి పద్మ(32) ఇంట్లో భర్త లేని సమయంలో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు అశ్వారావుపేట ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి భర్త, ఐదేళ్లలోపు చిన్నారి ఉన్నారు. కాగా ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ శ్రీరాముల శ్రీను మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

అశ్వారావుపేటరూరల్: పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని జెట్టివారిగూడెంలో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన కుర్సం అర్జున్ (33), భార్య సునీతకు మధ్య కొంతకాలంగా తరచూ గొడవలు జరుగుతుండేవి. మంగళవారం సాయంత్రం కుడా అర్జున్ తన భార్యతో గొడవ పడి గ్రామస్తుల ఎదుటే ఆమెపై దాడికి పాల్పడగా, అడ్డువెళ్లిన వారిని దుర్భాషలాడాడు. అనంతరం మనస్తాపానికి గురై పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. స్థానిక ఎస్‌ఐ శ్రీరాముల శ్రీను వివరాలను సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పది క్వింటాళ్ల మిర్చి చోరీ

టేకులపల్లి: మండలంలోని కోయగూడెం గ్రామానికి చెందిన జాల సతీష్ నాలుగు ఎకరాల్లో మిరపతోట వేశాడు. పంట మొత్తం కోయించి కల్లంలో ఆరబోశాడు. మంగళవారం ఉదయం వెళ్లి చూడగా సుమారు 10 క్వింటాళ్ల మిర్చి చోరీకి గురైనట్లు గమనించాడు. దీంతో రూ.2 లక్షల మేర నష్టపోయినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.12,595

ముందుంది ముప్పు

అడుగంటుతున్న పాలేరు జలాశయం

- రానున్న వేసవిలో తాగునీటి సరఫరాపై ఆందోళన
- ఇక్కడి నుంచే మూడు జిల్లాలకు సరఫరా
- రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.125 టీఎంసీలు మాత్రమే..
- కేఆర్‌ఎంబీ స్పందిస్తేనే సాగర్ నుంచి జలాలు
- మరోవైపు పంటలకు వదలాలంటూ రైతుల ఆందోళన



అడుగంటిన పాలేరు జలాశయం

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఈ వేసవిలో ఖమ్మం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాలకు తాగునీటి సరఫరాపై ఆందోళన వ్యక్తమవుతోంది. జిల్లాలకు నీరు సరఫరా చేసే పాలేరు జలాశయంలో నిల్వలు అడుగంటుతున్నాయి. కొద్దిరోజులైతే సరఫరా చేసే పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటికిప్పుడు సమస్య లేకున్నా.. నడివేసవిలో మాత్రం నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి సరఫరా కాని పక్షంలో ఇబ్బందులు తప్పేలా లేవు. ఈ ఏడాది జూలై వరకు మూడు జిల్లాలకు 3.50 టీఎంసీల నీరు అవసరం ఉండగా.. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.125 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉంది.

రోజుకు 135.45 క్యూసెక్కులు..

ఖమ్మం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల్లోని 2,439 గ్రామాలకు పాలేరు జలాశయం నుంచి తాగునీటి సరఫరా జరుగుతోంది. ఖమ్మం జిల్లాలో 276 గ్రామాలు, మహబూబాబాద్ జిల్లాలో 1,769, సూర్యాపేట జిల్లాలోని 394 గ్రామాలకు ఇక్కడి నీరే ఆధారం. ఈ రిజర్వాయర్ నుంచి రోజుకు 135.45 క్యూసెక్కుల నీటిని జిల్లాలకు తరలిస్తున్నారు. గత వానాకాలం సీజన్‌లో ఎగువన సరిగా వర్షాలు కురవకపోవడంతో నాగార్జునసాగర్ ప్రాజెక్టులోకి నీరు చేరలేదు. ఫలితంగా పాలేరు జలాశయం సైతం నిండలేదు. ఈ నేపథ్యాన జలవనరుల శాఖ ఉన్నతాధికారులు పలుమార్లు పరిశీలించి పంటలకు కాకుండా తాగునీటి అవసరాలకే వినియోగించాలని సూచించారు.

రోజురోజుకూ దిగువకు..

పాలేరు రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి మట్టం 23 అడుగులు కాగా మంగళవారం నాటికి 13.20 అడుగుల మేర నీరుంది. అదే టీఎంసీల్లో చూస్తే2.558కి గాను 1.125 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇంకా ఎనిమిది అడుగులు కిందకు వెళ్తే రిజర్వాయర్ డెడ్ స్టోరేజీకి చేరుతుంది. వర్షాభావ పరిస్థితులతో సాగర్ నుంచి నీటి విడుదల లేకపోవడం, పాలేరు పరీవాహకంలోనూ చినుకు కురవక.. రోజువారీ సరఫరాకు తోడు ఎండల కారణంగా రిజర్వాయర్ నానాటికీ అడుగంటుతోంది. ప్రధానంగా ఖమ్మం నగరానికి పదిహేను రోజులకు ఒకసారి 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలి. ఖమ్మం జిల్లా, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలకు కలిపితే ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలు వచ్చే నెల 15వ తేదీ వరకు సరిపోతాయి. ఈలోపు తాగునీటి కోసమైనా సాగర్ నుంచి నీరు విడుదల చేయకపోతే ఈ ప్రాంతాల్లో ఇబ్బందులు తప్పవు. మూడు జిల్లాల్లోని గ్రామాలకు జూలై వరకు నీరు అందించడానికి సుమారు 3.50 టీఎంసీలు అవసరముండగా, ఇందులో మార్చిలో సగం, ఏప్రిల్‌లో సగం ఇచ్చినా ఆటంకాలు ఉండవు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ముందస్తుగా సాగర్ నుంచి నెలకు ఒక టీఎంసీ చొప్పున విడుదల చేయడంపై అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు

పాలేరు జలాశయం ద్వారా జూలై వరకు తాగునీరు అందించేందుకు 3.50 టీఎంసీలు అవసరమని రెండు రోజుల క్రితం అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది. అయితే ప్రస్తుతం నాగార్జునసాగర్ ప్రాజెక్టులోని నీటి పంపిణీ కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్‌ఎంబీ) పర్యవేక్షిస్తోంది. దీంతో జిల్లా అధికారులు పంపిన ప్రతిపాదనలను ప్రభుత్వం కేఆర్‌ఎంబీకి పంపిస్తే అక్కడి నుంచి అనుమతి వస్తేనే సాగర్ నుంచి పాలేరుకు నీరు విడుదలయ్యే అవకాశముంది. వచ్చే నెల 15లోపు నీరు విడుదల చేస్తేనే మూడు జిల్లాలకు తాగునీటి సరఫరా నిరాంటకంగా జరగనుంది.

పంటలు ఎండుతున్నాయని..

పాలేరు పాత కాల్వ పరిధిలో కూసుమంచి, నేలకొండపల్లి మండలాల్లో బోర్లు, బావులు, చెరువుల కింద వరి, ఇతర పంటలు సాగు చేశారు. తొలుత భూగర్భ జలాలు సమృద్ధిగా ఉండగా ఇప్పుడు చెరువులు, బావులు, బోర్లు అడుగంటాయి. దీంతో రైతులు పాలేరు పాత కాల్వకు నీటిని విడుదల చేయాలని, తద్వారా చెరువులు నిండడంతో పాటు, బోర్లు, బావుల్లోకి నీరు వస్తుందని చెబుతూ ఆందోళన చేస్తున్నారు. తాజాగా మంగళవారం కూడా ధర్నాచేసి రైతు సంఘాల ఆధ్వర్యాన పాత కాల్వ గేట్లు ఎత్తారు. నీటి పారుదల శాఖ అధికారులు, పోలీసులు అప్రమత్తమై మళ్లీ గేట్లను కిందకు దించారు. పాలేరు పాత కాల్వ కింద కూసుమంచి మండలంలో 7,127 ఎకరాలకు గాను 5,600 ఎకరాల్లో, నేలకొండపల్లి మండలంలో 16,200 ఎకరాలకు 8,500 ఎకరాల్లో యాసంగి పంటలు సాగు చేశారు. భూగర్భ జలాలు అడుగంటడంతో ఈ పంటలు పడబడుతున్నాయి.

హత్యకేసులో ఇద్దరికి జీవితఖైదు

కొత్తగూడెంటౌన్: కుటుంబంలో జరుగుతున్న గొడవలు సద్దుమణిగేందుకు వివాహేతర సంబంధం పెట్టుకున్న మహిళను అడ్డు తొలగించుకోవాలని పథకం ప్రకారం హత్య చేసిన తండ్రీ కొడుకులకు జీవిత ఖైదు విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ మంగళవారం తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి.. చుంచుపల్లి మండలం హౌసింగ్‌బోర్డు కాలనీలో నిర్మాణంలో ఉన్న ఓ ఇంట్లో గుర్తు తెలియని మహిళ హత్యకు గురైంది. స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న చుంచుపల్లి వీఆర్వో కాకా మంగతాయారు ఈ ఘటనపై 2019 జనవరి 7న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు.. గుంటూరు జిల్లా కోసూరుకు చెందిన పెంద్రాల కోటయ్య, అతడి కుమారుడు పెంద్రాల అల్లియ్యలకు హత్యతో సంబంధం ఉన్నట్లుగా గుర్తించారు. అల్లియ్యకు అదే జిల్లా పిడుగురాళ్లకు చెందిన కళ్యాణితో మొదట నిశ్చితార్థం జరిగింది. అయితే అనివార్య కారణాలతో వారి పెళ్లి ఆగిపోయింది. ఆ తర్వాత కోసూరుకు చెందిన పాపమ్మను వివాహం చేసుకున్నాడు. కళ్యాణికి రాంబాబు అనే మరో వ్యక్తితో పెళ్లయింది. ఆమెకు ఓ పాప పుట్టాక రాంబాబు మృతిచెందాడు. వీరంతా దిష్టిబొమ్మలు విక్రయించే వ్యాపారం నిమిత్తం ఇల్లెందులో ఉంటున్నారు. అల్లియ్య తండ్రి కోటయ్య మాత్రం కొత్తగూడెంలో ఉంటున్నాడు. ఈ క్రమంలో అల్లియ్యతో కళ్యాణి వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ విషయంలో పాపమ్మకు, అల్లియ్యకు మధ్య నిత్యం తగాదా జరుగుతోంది. దీంతో కళ్యాణి అడ్డు తొలగించుకునేందుకు ఆమెను చంపాలని తండ్రీకొడుకులు నిశ్చయించుకున్నారు. పథకం ప్రకారం అల్లియ్య కళ్యాణిని ఇల్లెందు నుంచి కొత్తగూడేనికి మోటార్‌సైకిల్‌పై తీసుకొచ్చాడు. హౌసింగ్‌బోర్డు కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇంట్లోకి తీసుకెళ్లి ఆమెను కొట్టగా తీవ్రంగా గాయపడింది. ఇదే విషయాన్ని తండ్రికి సమాచారం అందించడంతో కోటయ్య కూడా ఆటోలో ఆ ఇంటికి చేరుకున్నాడు. కళ్యాణి ఇంకా ప్రాణాలతో ఉందని గుర్తించిన కోటయ్య సైతం ఆమెను కొట్టడంతో మృతిచెందింది. విచారణలో ఈ విషయాలను తేల్చిన పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. 19 మంది సాక్షులను విచారించిన న్యాయమూర్తి పెంద్రాల కోటయ్య, పెంద్రాల అల్లియ్యపై నేరం రుజువు కావడంతో ఇద్దరికీ జీవితఖైదు శిక్షతో పాటు చేరో రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మిర్జాఫిరదౌసీ ప్రాసిక్యూషన్ నిర్వహించగా లైజన్ ఆఫీసర్ ఎస్.వీరబాబు, కోర్టు డ్యూటీ ఆఫీసర్(హెచ్‌సీ)ఎ.లచ్చు సహకరించారు.

న్యూడెమోక్రసీ దళ సభ్యుడి అరెస్టు

ఇల్లెందురూరల్: మండలంలోని మస్సివాగు గ్రామం వద్ద న్యూడెమోక్రసీ చంద్రన్నవర్గం రాష్ట్ర కార్యదర్శి అశోక్ దళ సభ్యుడు కొమరయ్యను అరెస్టు చేసినట్లు సీఐ కరుణాకర్ తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల న్యూడెమోక్రసీ చంద్రన్నవర్గం రాష్ట్ర కార్యదర్శి, అజ్ఞాత దళ కమాండర్ అశోక్ మరికొందరు సభ్యులను అరెస్టు చేశామని, ఆరోజు తమ రాకను చూసి కొందరు సభ్యులు పారిపోయారని గుర్తుచేశారు. వారికోసం గాలింపు, వాహన తనిఖీలు కొనసాగిస్తున్న క్రమంలో మస్సివాగు వద్ద ఒక వ్యక్తి అనుమానాస్పందంగా కనిపించాడని, అతడి వద్ద ఉన్న సంచిని తనిఖీ చేయగా డిటోనేటర్లు, జిలిటెన్ స్టిక్స్ లభించడంతో విచారించామని తెలిపారు. అతడిని ఎన్డీ దళ సభ్యుడు కొమరయ్య అలియాస్ లింగయ్యగా నిర్ధారించి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని వివరించారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ కరుణాకర్

స్త్రీ నిధి రుణాల్లో అవకవతకలు

అశ్వాపురం : మండలంలోని పలు గ్రామాల్లో స్త్రీ నిధి రుణాల్లో భారీగా అవకతవకలు జరిగినట్లు సమాచారం. దీనిపై సంబంధిత అధికారులు దృష్టి సారించారు. మండల పరిధిలోని ఆనందాపురంలో సభ్యులు రుణం చెల్లించినా సుమారు రూ.2 లక్షలు స్త్రీ నిధి ఖాతాలో జమకాకుండా పక్కదారి పట్టాయనే ఫిర్యాదుతో స్త్రీ నిధి మేనేజర్ శ్యాంసుందర్ మంగళవారం విచారించారు. సభ్యులతో మాట్లాడి రుణాలు సక్రమంగా చెల్లించాలని సూచించారు. మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లోనూ రూ.కోటి మేర స్త్రీ నిధి రుణాల మంజూరులో అవకతవకలు జరిగినట్లు సమాచారం. దీనిపై అధికారులు పారదర్శంగా విచారణ జరిపితే అవకతవకలు వెలుగులోకి వస్తాయని పలువురు అంటున్నారు.

బాల్య వివాహాల అడ్డగింత

అశ్వారావుపేటరూరల్: ఐసీడీఎస్ అధికారులు బాల్య వివాహాలను అడ్డుకున్న ఘటన మంగళవారం జరిగింది. స్థానిక సీడీపీఓ రోజారాణి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు బాలికలకు బాల్య వివాహాలు చేస్తున్నారనే సమాచారంతో వాటిని అడ్డుకున్నారు. కాగా వీరిలో ఓ మైనర్‌కు ఈనెల 24న ఏపీలోని అన్నవరం ఆలయంలో వివాహం జరగగా, మంగళవారం ఇంటి వద్ద విందు కార్యక్రమాన్ని నిర్వహించడంతో నిలిపివేశారు. అయితే ఆధార్ కార్డు ప్రకారం తమ కుమార్తె మైనర్ కాదని తల్లిదండ్రులు చెబుతుండగా, పాఠశాల ధ్రువీకరణ పత్రాన్ని పరిశీలించిన తరువాత చర్యలు తీసుకుంటామని సీడీపీఓ తెలిపారు. అదే గ్రామానికి చెందిన మరో బాలిక(16)కు బుధవారం రాత్రి వివాహం చేసేందుకు ఏర్పాట్లు చేస్తుండగా, అడ్డుకుని బాలికను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఇద్దరు బాలికలను కొత్తగూడెంలోని బాలికల సంరక్షణ కేంద్రానికి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిపై స్థానిక ఎస్‌ఐ శ్రీరాముల శ్రీనును వివరణ కోరగా.. బాల్య వివాహాలపై ఇంకా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

తాగునీటి మోటార్లు మాయం

గుండాల: ఆళ్లపల్లి మండలం మర్కోడు పంచాయతీ పరిధిలోని శ్మశాన వాటిక, డంపింగ్ యార్డుల్లో ఉన్న మంచినీటి మోటార్లు అపహరణకు గురయ్యాయి. బోరు బావికి అమర్చిన మోటార్లను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారని తాజా మాజీ సర్పంచ్ శంకర్ బాబు, కార్యదర్శి నాగరాజు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కాగా, ఎంపీడీఓ రమాదేవి మంగళవారం గ్రామానికి వెళ్లి పరిశీలించారు. ప్రస్తుతం మొక్కలు ఎండిపోకుండా గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ద్వారా నీళ్లు పెట్టాలని సూచించినట్లు తెలిపారు.

ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలంఅర్బన్ : భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఏఆర్టీ సెంటర్‌లో ల్యాబ్ టెక్నీషియన్ పోస్టును కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ, ఎంఎల్టీ/డీఎంఎల్టీ/ ఎంఎల్టీ అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఈనెల 27 నుంచి మార్చి 4వ తేదీ వరకు ఆస్పత్రిలోని 38వ రూమ్‌లో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ఎంపికైన వారికి నెలకు రూ.12 వేలు వేతనం అందిస్తామని తెలిపారు. వివరాలకు 9963130775 నంబర్ లో సంప్రదించాలని సూచించారు.

పోక్సో కేసులో కఠిన కారాగార శిక్ష

కొత్తగూడెంటౌన్: బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి పోక్సో కేసులో కఠిన కారాగార శిక్ష విధిస్తూ మొదటి అదనపు జిల్లా జడ్జి (పోక్సో స్పెషల్ జడ్జి) డాక్టర్ ఎం.శ్యాంశ్రీ మంగళవారం తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి.. 2021 ఫిబ్రవరి 15న మణుగూరు సర్వెంట్ క్వార్టర్‌కు చెందిన బాలికపై సంతోష్‌నగర్‌కు చెందిన మోతుకూరి వెంకటేశ్వర్లు అసభ్యంగా ప్రవర్తించాడని, వెంకటేశ్వర్లు అల్లుడు కొత్తూరి సందీప్ సైతం అసభ్యంగా తిట్టాడని అదే నెల 24న బాలిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో విచారణ చేపట్టిన పోలీసులు దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జ్‌షీట్‌ను దాఖలు చేశారు. తొమ్మిది మంది సాక్షులను విచారించిన జడ్జి.. మోతుకూరి వెంకటేశ్వర్లుపై నేరం రుజువు కావడంతో సెక్షన్ 506 ప్రకారం ఆరు నెలల జైలుశిక్షతో పాటు రూ.5వేలు జరిమానా, 353 ఎ ప్రకారం ఒక సంవత్సరం కఠిన కారాగార శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ, రెండు శిక్షలు ఏకకాలంలో అనుభవించాలని తీర్పు చెప్పారు. కొత్తూరు సందీప్‌పై నేరం రుజువు కాకపోవడంతో కేసు కొట్టివేస్తున్నట్లు ప్రకటించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రావి విజయ్‌కుమార్ ప్రాసిక్యూషన్ నిర్వహించగా, లైజన్ ఆఫీసర్ ఎం.హరిగోపాల్, కోర్టు డ్యూటీ ఆఫీసర్ ఎం.అశోక్ సహకరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

చుంచుపల్లి/జూలూరుపాడు : చుంచుపల్లి మండలం విద్యానగర్ బైపాస్ ప్రాంతంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జూలూరుపాడు మండలం గుండెపుడికి చెందిన గోగుల గోపాల్‌రావు–కోటమ్మ దంపతుల పెద్ద కుమారుడు గోగుల నర్సింహరావు(28) కొత్తగూడెం నుంచి జూలూడుపాడు వైపునకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో నర్సింహరావు అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య శిరీష, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నరసింహారావు మృతితో గుండెపుడిలో విషాదం అలుముకుంది. కాగా, ఈ ప్రమాదంపై చుంచుపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



ప్రసాద్(ఫైల్)

సుజాతనగర్: అనారోగ్య కారణాలతో కలత చెందిన ఓ వ్యక్తి పురుగుల మందు తాగగా.. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన కున్సోత్ ప్రసాద్(33) కడుపునొప్పితో పాటు తరచుగా ఎక్కిళ్లు వస్తూ బాధ పడుతున్నాడు. గతనెల 31న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు కొత్తగూడెం ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. ఖమ్మం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ప్రసాద్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

రోళ్లపాడులో మహిళ..

టేకులపల్లి: మండలంలోని రోళ్లపాడు సమీపంలో ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ షేక్ సైదా రహూఫ్ కథనం ప్రకారం.. తొమ్మిదోమైలుతండా పంచాయతీ కోటల్ల గ్రామానికి చెందిన ఈసం భద్రమ్మ(48)కు మతిస్థిమితం ఉండదు. మద్యం సేవిస్తూ అప్పుడప్పుడు ఇల్లు వదిలి వెళ్తూ రెండు, మూడు రోజులకు తిరిగి వచ్చేది. సోమవారం కూడా ఇంటి నుంచి వెళ్లిన భద్రమ్మ మంగళవారం రోళ్లపాడు సమీపంలోని ఓ చేనులో శవమై కనిపించింది. స్థానికుల సమాచారంతో కుటుంబసభ్యులు వెళ్లి చూసి గుర్తించారు. ఈ మేరకు ఎస్‌ఐ సిబ్బందితో అక్కడికి వెళ్లి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఇల్లెందు ఆస్పత్రికి తరలించారు. మృతురాలి భర్త నీలం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దోషులను శిక్షించండి

డీజీపీకి ఫిర్యాదు చేసిన ఎంపీ కవిత, నేతలు



డీజీపీకి వినతిపత్రం ఇస్తున్న ఎంపీ కవిత, సత్యవతి, హరిప్రియ

ఇల్లెందు: ఇల్లెందులో మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానానికి సమావేశం నిర్వహించిన రోజు కౌన్సిలర్లపై దాడి, కిడ్నాప్ ఘటనలపై సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షించాలని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మహబూబాబాద్ ఎంపీ కవిత, మాజీ ఎమ్మెల్యే హరిప్రియ కోరారు. ఈ సందర్భంగా మంగళవారం వారు హైదరాబాద్‌లో డీజీపీ రవిగుప్తాకు వినతిపత్రం అందజేశారు. అలాగే, రాష్ట్రవ్యాప్తంగా బీఆర్‌ఎస్ నేతలు, మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, దోషులను శిక్షించేలా ఎస్పీలకు తగిన ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

సీట్ల కేటాయింపులో ఆదివాసీలకు అన్యాయం



మాట్లాడుతున్న చందా లింగయ్య దొర

మణుగూరు రూరల్/మణుగూరు టౌన్: ఆదివాసీ జనాభా ఎక్కువగా ఉన్న మహబూబాబాద్ లోక్‌సభ స్థానం కేటాయింపులో ఆదివాసీలకు అన్యాయం జరుగుతోందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకుడు చందా లింగయ్యదొర అన్నారు. మణుగూరులో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహబూబాబాద్ స్థానం నుంచి పోటీకి అవకాశం కల్పించాలని కాంగ్రెస్ అధిష్టానానికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. గతంలో తాను ఎమ్మెల్యేగా, జెడ్పీ చైర్మన్‌గా ఉన్నప్పుడు రహదారులు, ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేశానని, నిధుల కేటాయింపులో ఏజెన్సీ గ్రామాలకు అన్యాయం జరగకుండా చూశానని గుర్తుచేశారు. పార్టీలతో సంబంధం లేకుండా ఆదివాసీలు తనకు అండగా ఉన్నందున, అధిష్టానం ఆశీస్సులతో సీటు కేటాయిస్తే తప్పక గెలుస్తాననే నమ్మకం ఉందని పేర్కొన్నారు. కాగా, తనకు పోటీ చేసే అవకాశం ఇస్తే గెలవడం ఖాయమని, ఆతర్వాత మణుగూరు– రామగుండం రైలు మార్గాన్ని మంజూరు చేయించడంతో పాటు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి పాటుపడతానని లింగయ్య తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు నామా వెంకటేశ్వరరావు, దొబ్బల వెంకటప్పయ్య తదితరులు ఉన్నారు.

ఈజీఎస్‌లో అవకతవకలపై సామాజిక తనిఖీ

36 మంది సిబ్బందికి షోకాజ్ నోటీసులు



సామాజిక తనిఖీ నివేదికలపై విచారణ చేస్తున్న అధికారులు

బూర్గంపాడు: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీ బహిరంగ వేదికలో అనేక అవకతవకలు బయటపడ్డాయి. అదనపు డీఆర్‌డీఓ రవి ఆధ్వర్యంలో జరిగిన సామాజిక తనిఖీ బహిరంగ వేదికలో మస్టర్ రోల్స్ నిర్వహణపై అనేక ఆరోపణలు వచ్చాయి. సామాజిక తనిఖీ బృందాలు మస్టర్లను దిద్దడంతో పాటు తప్పుగా నమోదు చేసినట్లు గుర్తించారు. పనుల కొలతల్లోనూ తేడాలను గుర్తించారు. వీటిపై రవి సంబంధిత ఈజీఎస్ సిబ్బందిని, పంచాయతీ కార్యదర్శులను ప్రశ్నించారు. ఉపాధి హామీ పనుల నిర్వహణ తీరుపై జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత కూడా ఆరోపణలు చేశారు. పనులకు రాకుండానే కొందరికి మస్టర్లు వేశారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి పనుల నిర్వహణ తీరులో జరిగిన అవకతవకలపై అదనపు డీఆర్‌డీఓ 36 మంది సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జమలారెడ్డి, ఈజీఎస్ సోషల్ అడిట్ బృందం ఇన్‌చార్జ్ అనూష, అంబుడ్స్‌మెన్ నాగప్రకాశ్, ఏపీఓ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బూర్కలంక ఎన్‌కౌంటర్ బూటకం

మావోయిస్టు పార్టీ కిష్టారం ఏరియా కమిటీ పేరిట లేఖ

దుమ్ముగూడెం : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లా బెజ్జి పోలీస్‌స్టేషన్ పరిధిలో గల బూర్కలంక గ్రామంలో ఈనెల 24న జరిగిన ఎన్‌కౌంటర్ బూటకమని మావోయిస్టు పార్టీ కిష్టారం ఏరియా కమిటీ కార్యదర్శి రాజు పేరిట మంగళవారం లేఖ విడుదల చేశారు. ఈ ఎన్‌కౌంటర్‌లో బూర్కలంక గ్రామస్తుడు కర్తం భీముడిని హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఎన్‌కౌంటర్‌లో ఒక మావోయిస్టు మృతి చెందాడని పోలీసులు కల్పిత కథనం సృష్టించి మీడియాకు చెప్పారని, ఇది అసత్యమని తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లో నూతన ప్రభుత్వం ఏర్పాటయ్యాక కొత్త పోలీసు క్యాంపులు తెరిచి పెట్రోలింగ్ నిర్వహిస్తూ గ్రామాల్లో అమాయక ప్రజలపై దాడులు చేస్తున్నారని, అరెస్టులు, తప్పుడు కేసులతో జైలుకు పంపడం, మహిళలపై అఘాయిత్యాలు, సాధారణ ప్రజలకు నిత్యం బెదిరింపులు పెరిగాయని ఆరోపించారు. బూర్కలంక ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.